


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### *ఓ.సీ.డీ*

**మా ఎదురింటావిడ** హోరున వర్షం కురుస్తుంటే, గొడుగు వేసుకుని వాకిట్లో ముగ్గులు పెడ్తోంది. సంక్రాంతి నెల పట్టినప్పుడే కాదు. 365 రోజులూ ఆవిడ తన ఇల్లు దాటి తారు రోడ్డు మీదకొచ్చి పెద్ద పెద్ద ముగ్గులు, ఒంచిన నడుం ఎత్తకుండా, మధ్యాహ్నం పన్నెండు గంటలు కొట్టేదాకా, మొహం అయినా కడగకుండా వేస్తూనే వుంటుంది. ఇంతలో రోడ్డు మీద ఏ స్కూటరో, కారో వెళ్ళడం దుమ్ము రేపుకుంటూ, ముగ్గు చెరిగిందని ఈవిడ 'మోగడం' నానా తిట్లూ తిట్టడం. ఈ మోగడం అన్నమాట ఆవిడని చూసే నేర్చుకున్నా.

"మధ్యాహ్నం కాయకూరల బండి వాడు ముగ్గుమీద నుండి బండి తీసుకెళ్ళాడు. నేను మోగాను" అనేది. పాపం వాళ్ళాయన పేరు ఏంటో కానీ మా ఆయన మొదటిసారి ఆయన్ని చూడగానే సన్యాసిరావు అని ఫిక్స్ అయి, ఆవిడతో కూడా "సన్యాసిరావుగారున్నారా?" అంటే, ఒకటి రెండుసార్లు ఆయన అసలు పేరు చెప్పి చూసి, ఈయన వినేరకం కాదు. విన్నా పేర్లు ఈయనకి గుర్తువుండవు అని తెలిసి, ఆవిడ ఎడ్జెస్ట్ అయి, ఆయన్ని పిలుచుకొచ్చేది.

ఆ సన్యాసిరావుగారు "కాస్త టీ నీళ్ళు అయినా పోసి ముగ్గు పెట్టుకోవే" అని గొంతు తడారిపోయేదాకా అడిగి, చివరికి వుద్యోగానికి వెళ్ళిపోయేవాడు. ఆయన ఓనాడు ఆఫీసు నుండి రాలేదు. పాపం తీసుకొచ్చారు. హార్ట్ ఎటాక్ వచ్చి అమాంతం పోయాడు. చాలా బాధాకరమైన విషయం. నేనెళ్ళి చాలా ఓదార్చి వచ్చాను. "టీ తప్పేళా పగిలిపోయిందండీ ఇంక నన్ను ఎవరు టీ పెట్టమని అడుగుతారండీ?" అంటూ నన్ను కావలించుకుని ఆవిడ ఏడ్చింది.

బాధలో వుంది పాపం. కానీ మొగుడ్ని తప్పేళాతో పోల్చడంలో భావుకత ఏవిటో నాకు అర్థం కాలేదు కానీ, ఇంకా రోజులు కూడా గడవకుండానే ఈవిడ ఒంగి వాకిట్లో ముగ్గులు పెడ్తూ కనిపించింది. అసలు రోడ్డు వూడుస్తుంటే ఆవిడకి ఎక్కడ ఆపాలో తెలిసేది కాదు. ఆ కొడుకు "నువ్వా నీలం చీరకట్టుకుని ఆ మునిసిపల్ వర్కర్స్‌తోపాటు వెళ్ళిపో. నాకు అన్నం పెట్టకు" అని అరిచి చిందులు వేసేవాడు.

వీడికైనా బుద్ధొచ్చి టీ పెట్టుకోవడం, అన్నం వండుకోవడం నేర్చుకోడు ఏవిటీ? వాళ్ళమ్మకి ఓసీడీ కదా" అని మా ఆయన అంటే నాకు అప్పుడు అర్థమైంది. ఆవిడకి 'అబ్సెసివ్ కంపల్సివ్ డిసార్డర్' అని

ఆవిడ కొడుకు పేరేమిటో కానీ మా ఆయనకి పేర్ల బాధలేదు. ఆయనే పెట్టుకుంటారు. ఆయనకి గుర్తున్న పేర్లు వాడికి జూనియర్ సన్యాసిరావ్ అని పేరు పెట్టారు. నేనూ అలాగే చెప్తుంటాను మా వారికి అర్థంకావడానికి. వీళ్ళ ఇంట్లోకి ఎవరు అద్దెకొచ్చినా ఒకే కారణంతో

కొట్లాటయ్యేది సన్యాసమ్మకి. ఆవిడకి మాత్రం వేరే నామధేయం ఎందుకూ? ఇలాగే అనుకుందాం. వాకిలి వూడ్చి నీళ్ళు జల్లి ముగ్గుపెట్టడం రాని ఇల్లాలు ఏం ఇల్లాలూ?" అని మొదలయ్యేది గొడవ.

ఆ అద్దెకొచ్చినావిడ "ఏదో ముగ్గు అంటే రెండు అడ్డకర్రలూ, రెండు నిలువు కర్రలూ వేస్తాం కానీ ఇలా రోజూ సంక్రాంతి ముగ్గులు మా వల్ల కాదమ్మా" అని అందా.. అంతే అర్జెంటుగా ఇల్లు ఖాళీ చేయించేసేది సన్యాసమ్మ.

ప్రస్తుతం మున్సిపాలిటీ వాళ్ళు రోడ్డు వెయ్యడానికి, మా ఇంటి ముందు మొత్తం తవ్వించి, కంకర పోసి, కట్టలు కట్టిన రోడ్డుమీద 'ఎవరింటి ముందు వాళ్ళే నీళ్ళు పోసి క్యూరింగ్ చేసుకోమని' చక్కా పోయారు.

ఎక్కడికెళ్ళాలన్నా మేం రోడ్డు మీదకొచ్చి ఆ గతుకుల్లో పడి చచ్చీ చెడీ నడిచి, మా డ్రైవర్ తెలిసిన వాళ్ళ కారు షెడ్డులో నుండి కారు తెస్తే ఎక్కి వెళ్తున్నాం. ఇలాంటి గతుకుల్లో, కట్టలు కట్టిన రోడ్డు మీద, కంకర మీద మా సన్యాసమ్మగారు "ముత్యమంతా పసుపు ముఖమంత ఛాయ" అని ముగ్గులు పెట్టేస్తోంది. బాపూగారు బతికుంటే ఎంత ముచ్చటపడేవారో.

ఇదిలా వుండగా ఆవిడ వెన్నుపూస అరిగిపోయిందనీ, ఆవిడస్సలు ఒంగకూడదనీ, ఆర్మీ హాస్పిటల్‌లో చెప్పి 'ఆపరేషన్' అని చీటీ మీద రాసి మరీ పంపించారంట. ఇలా ఒంగి ఒంగి వూడ్చి వూడ్చి చీపుర్లే కాదు వెన్నుపూసలు కూడా అరిగిపోతాయనమాట. ఈ వార్త మా వరాలు నాతో చెప్పి "ఆ అమ్మ నన్ను వాళ్ళింట్లో పని చెయ్యమంటోందమ్మా. అమ్మతల్లో నీకో దణ్ణం నీ ఇంటిముందు అంతంత ముగ్గులు నేను పెట్టలేను. నీలా నేను వూడవలేను" అని చెప్పాను అంది.

ఆవిడ ముగ్గు వేసి ఊరుకోదు. అక్కడే ఎవడు తొక్కుతాడా, వాడి పుచ్చెపగలకొడదాం అన్నట్టు కర్ర పుచ్చుకుని కూర్చుంటుంది.

ఇది ఇలావుండగా, ఈవిడ పక్క ఇంట్లోకి ఎవరొచ్చినా ఈవిడ గయ్యాళితనానికి ఇల్లు అమ్ముకుని పోయేవాళ్ళు. చివరికి ఒకావిడ ఆ ఇల్లు కొనుక్కుని వచ్చింది. ఆవిడ రెండు బర్రెల్ని కొని, ఈ సన్యాసమ్మ గేటు పక్కన కట్టెయ్యడం మొదలుపెట్టింది. అవి ఎప్పుడూ తడి ఆరకుండా జీవనదుల్లా సన్యాసమ్మ ముగ్గు పెట్టగానే, మూత్రం బొలబొలా పొయ్యడం మొదలెట్టాయి. పైగా రెడీమేడ్ గొబ్బిళ్ళలా పేడ కడిలు కూడానూ. అసలే సన్యాసమ్మ మోగడం ఎక్కువ కదా జంబూరా కంఠం వేసుకుని ఆవిడ మీద కూడా మోగింది.

ఆ గొడవ ఓనాడు ప్రొద్దుటే ఆరింటికి ఆరంభమై మన వినాయకచవితి వ్రత కథలో జాంబవంతునితో శ్రీకృష్ణుడు పోరాడాడని చెప్తారే తొమ్మిది పగళ్ళూ, తొమ్మిది రాత్రులూ. అలా మన టీ.వీ సీరియల్లా సాగింది. ఆ నవరాత్రుల్లోనే, ఒకరింటి కబుర్లు ఒకరు 'వరల్డ్ ఫేమస్' చేసారు.

"నీ గయ్యాళితనం వల్లే నీ మొగుడు పోయాడు" అంటే,

"నువ్వు వేరే దాని మొగుడ్ని లేపుకొచ్చావు. నువ్వు నా గురించి మాట్లాడ్తావా?" అని ఇద్దరూ రుద్రమ్మలూ, నాగమ్మలూ అయి పోట్లాడుకున్నారు. కానీ సడెన్‌గా సన్యాసమ్మ 'చుప్' అయిపోయింది.

ఎందుకబ్బా? అనుకున్నాను. అప్పుడు మా వరాలు చెప్పింది. సన్యాసమ్మ ఇంటి పక్కకొచ్చిన గరిండేరమ్మ, ముగ్గు వెయ్యడమే కాకుండా, అందులో నిమ్మకాయలూ, కోడి రక్తం కలిపిన అన్నం మెతుకులు కూడా వేస్తోందట. అది చూసి భయంతో సన్యాసమ్మ నోరు కట్టు పడిపోయింది. మన దేశంలో గండ్రగొడ్డళ్ళకీ, వేటకొడవళ్ళకీ భయపడని వారుకూడా నిలువుగా కోసిన ఓ నిమ్మకాయకీ, వెంట్రుకల వుండకీ, పసుపూ, కుంకుమ వేసిన అన్నం మెతుకులకీ భయపడ్తారు కదా.

మా చిన్నప్పుడు, ఇంటి పక్కనో బామ్మగారుండేవారు. ఆవిడకి పేకాటాడ్డం పిచ్చి. ఆవిడ ఎవరూ లేకపోతే బొడ్డూడని వెధవ దారే పోతున్నా పిలిచి, "నీకు జీళ్ళు కొనిపెడ్తా, నాతో రెండు ఆటలు ఆడు. నీకు రాకపోతే ముక్కలు పట్టుకో చాలు. రెండు ఆటలూ నేనే ఆడుకుంటా" అని లంచం ఇచ్చి మరీ పేకాటాడేసేవారు. ఈ అలుసు కనిపెట్టి సందానీ ఆవిడతో నాలుగు ఆటలేసి, బడి దగ్గర జీళ్ళ వ్యాపారమే పెట్టేసేవాడు.

అంతేకాదు ఆవిడకి నెలకోసారి మంగలాడిని కూడా పిలుచుకొచ్చే డ్యూటీ వీడిదే

అప్పుడు ఆవిడ పేకాట పిచ్చికి నవ్వుకునేవాళ్ళం కానీ, ఇప్పుడావిడ్ని తలచుకుంటే నా గుండె జాలితో కరిగిపోతుంది. పాపం వయసులో వున్నప్పుడే భర్త పోయాడని ఆవిడ జుట్టు తీయించేసారుట అన్నదమ్ములు. జుట్టేం చేసింది పాపం? అప్పటినుండి ఈ పేకాట పిచ్చి పట్టుకున్నట్లుంది. ఓసారి సందానీగాడిని ఎవడో తన్నాడు బడిలో. మంచి కాకమీదున్నప్పుడు బామ్మగారు పిలిచి, "ఇదిగో మాట. నీకు పావలా ఇస్తాను, మంగలాడ్ని పిలుచుకురా" అంది.

"నీకీ మొగుడికి చెప్పు పిలుచుకొస్తాయి" అన్నాడు వాడు తిక్కగా.

"అయ్యో.. ఆయనే వుంటే మంగలాడెందుకురా?" అని బామ్మగారు కంట తడి పెట్టారు. నేనూ, సుబ్బులూ, భవానీ, మంజూ ఇది చూసి సందానీగాడికి చాకిరేవు పెట్టి, వీపు సాపు చేసాం "పెద్దావిడ్ని ఏడిపిస్తావా?" అని.

ఆవిడ్ని బాధపెట్టకూడదని, మేం వంతులు వేసుకుని ఆవిడతో పేకాట ఆడి ఆడి, జిల్లాస్థాయి పోటీలకి వెళ్ళే లెవెల్‌కి వచ్చేసాం. అర్ధరాత్రి కూడా నిద్రలో "ఇస్పేట్ ఆఠీన్ వెయ్యి, కళావర్ రాణి నాది" అని కలవరింతలు.

అమ్మమ్మ లేపి ప్రైవేటు చెప్పి, చెవి నులిమేది. అసలు ఒలింపిక్స్‌లో ఇలాంటి స్కిల్ వున్న గేమ్స్ ఎందుకు పెట్టరో? ఎప్పుడూ పేకాటలో ఆస్తులు పోగొట్టుకున్నవాళ్ళనే ఉదాహరణగా చెప్తారుకానీ, నేతి పేరయ్య గారి అల్లుడు పేకాటలో బోలెడు గడించి, ఆఠీన్ ఆకారంలో మేడకట్టి, 'జోకర్ నిలయం' అని పేరెట్టుకున్నాడులాంటివి చెప్పరు.

మాములుగా ఓసీడీ అనగానే, కడిగిందే కడగడం, చేతులు కడుక్కోవడం, ఇల్లు తుడుచుకోవడం మనకి తెలుసు. ఇప్పుడు కోవిడ్ టైంలో ఎవరూ వాళ్ళని సైక్రియాటిస్టులకి చూపెట్టడంలేదు. ఎందుకంటే మనమూ అంతేగా. ఎవరైనా కూరగాయలో, పండ్లో తెచ్చి అక్కడ పెట్టగానే బకెట్లో వేసి కడిగెయ్యడం, చేతులు సబ్బుతో కడుక్కోవడం. మా ఆడబిడ్డ ప్రాణం కూడా సుఖంగా వుంది. మేం అన్ని నీళ్ళు ఖర్చు చెయ్యకు. ఇంటి చుట్టూ, మెట్లూ రోజూ కడగకు, రోజుకి మూడుసార్లు స్నానం ఎందుకు? అనడం మానేసాం. కడగనీ మంచిదే అని ఊరుకుంటున్నాం.

ఇంకో ఆవిడకి మా బంధువుల్లో మొక్కల పిచ్చి. ఏదైనా శృతి మించితేనేగా 'పిచ్చి' అంటాం. ఆవిడ మనింటికొచ్చినా, ఇడ్లీ ముక్క తుంచి నోట్లో వేసుకుని వెక్కి వెక్కి ఏడుస్తుంది. "ఉప్పు ఎక్కువైందా? బాగాలేదా? చెప్పచ్చుగా? ఏడుపెందుకూ?" అని అడుగుతాంగా కంగారుగా.

"మా గులాబీ తల్లి అసలే నిండుగా మొగ్గ తొడిగింది. ఈ పూట నీళ్ళు పోయలేదు. నేనిక్కడ తింటూ కూర్చున్నా" అని కళ్ళు ఒత్తుకుంటుంది.

ఇంక పెంపుడు జంతువుల గురించి మనం తక్కువ చెప్పుకుంటే మంచిది. వాటిని పేరుతో పిలవాలి. మావయ్య వచ్చాడూ, పిన్ని పిలుస్తోంది అని. కుక్కకి మనని చూపించి చెప్పినా, మనం నోర్మూసుకోవాలి. మా రామూ (కుక్క) ఏకాదశి రోజువచ్చి మంచి నీళ్ళు ముట్టుకోడు, ఉపవాసం చేస్తాడు. మా బిజిలీ (ఇదీ కుక్కే) చిరంజీవి పాట పెడ్తే, ఎక్కడున్నా పరుగెత్తుకొచ్చేస్తుంది" అన్నా మనము ఆనందంగా తలలూపాలి.


ఇంక కొందరు దేవుడికి దణ్ణం పెట్టడం, చెంపలు వేసుకోవడం, ప్రతి నిమిషం చేస్తూనే వుంటారు. ఎదురింటి శేషప్ప మావయ్యగారితో ఓసారి చిన్నప్పుడు బజారుకెళ్తుంటే ప్రతి చిన్నగుడి దగ్గరా, పుట్టదగ్గరా సాష్టాంగ పడిపోతున్నాడు, చెంపలు వేసుకుంటున్నాడు. నేనూ, సందానీగాడు కూడా వేసేసుకుంటున్నాం. చివరికో చోట ఆయన సాష్టాంగ పడిపోతుంటే సందానీగాడు "గది కరీం మియా మూడో బీవీ కీ గోరీ (సమాధి) వున్నయ్" అని తెగ నవ్వాడు.

ఆయన పెళ్ళాం ఎప్పుడూ మడి కట్టుతోనే నీళ్ళు జల్లుతూ "అసింటా వెళ్ళండిరా.. మా వాకిలి తగలకండి" అని తిడ్తుండేది. ఈయనకి ఇంత దైవభక్తా? భయమా? అనుకునేదాన్ని. ఓనాడు సందానీ చెప్పాడు "ఈయన ఆ ఇస్కూల్ పక్క రెండో సందులో జాస్మీన్ టీచర్ చెల్లెతో చిన్నిల్లు పెట్టినయ్. ఇక్కడ నామాలు పెట్టుకుని తిరుగుతయ్" అని. ఆ తర్వాత, అసలు సంగతి తెలిసి ఈయన దణ్ణాలకీ ఆ పెళ్ళాం మడికీ కూడా వైద్యం జరగాల్సి వచ్చింది అనుకోండీ.

మరికొందరు కనుబొమ్మలెగరేస్తుంటారా? మనని ఏదో అడుగుతున్నారనో, లేదా, మనలో ఏదైనా సరిగ్గా లేదని చెప్తున్నారో అని మనం అనుమానపడి సర్దుకుంటాం. మరి కొందరు ముక్కు చిట్లిస్తారు. మా అక్క ఆడబడుచు పెళ్ళి చూపుల్లో కాఫీ తీసుకెళ్తే, ముక్కు చిట్లించాడు పెళ్ళి కొడుకని వెనక్కి తీసుకొచ్చేసిందిట. మిఠాయిలు తీసుకెళ్ళి, మళ్ళీ వెనక్కి తీసుకొచ్చేస్తుంటే, పెళ్ళిళ్ళ పేరయ్య "అమ్మా.. అది అబ్బాయికి నచ్చకకాదు. ముక్కు చిట్లించడం అతని అలవాటు. అక్కడ పెట్టి వెళ్ళు" అని పట్టుకున్నాడట.

(TOC TOC) టాక్ టాక్ అనే ఓ ఫ్రెంచ్ సినిమా నెట్ ఫ్లిక్స్‌లో వుంది ఈ ఓ.సీ.డీ పేషెంట్ల గురించి. ఒకడు గళ్ళల్లో నడవడు. నేల తగలకుండా కిటికీలవీ పట్టుకుని గెంతుతుంటాడు. ఇంకొకావిడ తలుపు తాళం చూడ్డానికి వెనక్కి వెళ్ళడం, పట్టుకు లాగడం, ముందుకి రావడం. ఎప్పటికీ ముందుకి వెళ్ళలేదు. ఇంకొక అమ్మాయి జబ్బలకీ, చేతులకీ ఎవరు తగిలినా కడుక్కోవడమే. ఇంకొక ముసలాయన ఆడవాళ్ళు కనిపిస్తే చాలు అసభ్యమైన సైగలూ బూతులూ. ఇంకొకడు నడిచిన అడుగులూ, వేసిన గుటకలూ, ఎక్కిన మెట్లూ అన్నీ లెక్క పెట్టుకోడమే. మనకి వినోదంగా వుంటుంది. కానీ అది ప్రాణాంతక వ్యాధే ఏదైనా అతి మంచిదికాదు అని పెద్దలు ఊరికే అనలేదు.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4